

అమ్మవార్ల గద్దెల వద్ద భక్తజన సందోహం


# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | సోమవారం 5 ఫిబ్రవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY








బంగారం కోసం పోటీపడుతున్న భక్తులు



# వనమంతా జనం

### మేడారానికి భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు

- సమ్మక్క-సారలమ్మలకు మదినిండా మొక్కులు
- వాహనాలతో రద్దీగా మారిన దారులు
- 6లక్షల మంది దర్శించుకున్నట్లు అంచనా



మేడారం దారిలో వాహనాల రద్దీ

వనదేవతలు సమ్మక్క-సారలమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేట్, ఆర్టీసీ బస్సుల్లో లక్షలాది మంది భక్తులు మేడారానికి తరలివచ్చారు. ఎటు చూసినా దారులన్నీ నిండిపోయి కనిపించాయి. మొదట అమ్మవార్లకు తలనీలాలు సమర్పించి జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అమ్మవార్ల గద్దెలపై ఎత్తు బంగారం, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం- నార్లాపూర్, మేడారం-తాడ్వాయి, ఊరట్టం-కాల్వపల్లి, కొత్తూరు ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 6లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. 5 కిలోమీటర్ల మేర వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిచాయి. రద్దీ అధికంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ములుగు ఎస్పీ శబరీష్ పర్యవేక్షించారు. రోడ్లపై వాహనాలు నిలువకుండా చర్యలు చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలో అనుమతించారు.

*- తాడ్వాయి, ఫిబ్రవరి 4*



జంపన్న వాగులో స్నానాలాచరిస్తున్న భక్తులు

## మేడారం బంగారానికి ఆంక్షలు

- ఆధార్ కార్డు తప్పనిసరి చేసిన అధికారులు
- ఇబ్బందిపడుతున్న భక్తులు, వ్యాపారులు



మహబూబాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : మేడారం జాతరకు వెళ్లే భక్తులకు అధికారులు ఆంక్షలు విధించారు. బంగారం( బెల్లం) కొనుగోళ్లకు ఆధార్ కార్డు తప్పనిసరి చేయడంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతరలో భక్తులు పెద్ద ఎత్తున బంగారాన్ని (బెల్లాన్ని) అమ్మవార్లు సమ్మక్క, సారలమ్మకు సమర్పిస్తారు. ఏటా వేలాది క్వింటాళ్ల బంగారాన్ని మొక్కుగా చెల్లిస్తారు. అయితే, గతంలో ఈ బెల్లాన్ని అక్రమార్కులు కొనుగోలు చేసి గుడుంబా తయారీకి వినియోగించే వారని, అధికారులు అమ్మకాలపై నిఘా పెట్టేవారు. ఈ ఏడాది ఏకంగా బెల్లం కొనుగోళ్లకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆంక్షలు విధించారు. బంగారం కొనుగోలు చేసే ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఫోన్ నంబర్ సేకరించి తమకు అందజేయాలని వ్యాపారులకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వనిదే బంగారం విక్రయించేది లేదని తేల్చిచెబుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు మేడారంలో కూడా ఆధార్ కార్డు ఉంటేనే భక్తులకు బంగారాన్ని వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు కొత్తగా నిబంధనలు విధించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలతోపాటు మేడారంలో బెల్లం విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. ఈ నేపథ్యంలో బెల్లం పక్కదారి పట్టకుండా ఎక్సైజ్ అధికారులు తీసుకుంటున్న చర్యలు భక్తులకు ఇబ్బందిగా మారాయి. మేడారం వెళ్లే భక్తులు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ వెంట తీసుకెళ్లడం సాధ్యం కాదు. ఇప్పటికైనా అధికారులు ఈ కొత్త నిబంధనను సడలించాలని అటు వ్యాపారులు ఇటు భక్తులు కోరుతున్నారు.

### నిబంధనలు ఎత్తి వేయాలి

ములుగు రూరల్, ఫిబ్రవరి 4 : మేడారం సమ్మక్క-సారలమ్మకు భక్తులు సమర్పించే ఎత్తు బంగారంపై ఆధార్ కార్డు జిరాక్స్‌లు సమర్పించాలనే నిబంధనను ఎత్తివేయాలని ములుగు జిల్లా సామాజికవేత్త సుతారి సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బెల్లం పక్కదారి పట్టకుండా కొనుగోలుదారుల నుంచి ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్, ఇంటి చిరునామా తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులు ఆదేశించడం భక్తులను జాతరకు దూరం చేయడమే అవుతుందని ఆరోపించారు. భక్తుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి వారి వ్యక్తిగత జీవితాలకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు. ఈ ఆదేశాలు నిలిపివేసి పక్కదారి పట్టే బెల్లంపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఆలోచనలు ప్రభుత్వం మానుకోవాలన్నారు.

## తల్లీకొడుకు మృతిపై విచారణ వేగవంతం

### ఆరుగురిపై కేసు నమోదు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 4: తల్లీకొడుకు మృతిపై మిల్స్‌కాలనీ పోలీసులు విచారణను వేగవంతం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగశాయిపేటకు చెందిన తస్లీమ్ సుల్తానాతోపాటు తన ఏడు నెలల కుమారుడి మృతదేహాలు పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ దర్గా చెరువులో లభించాయి. శుక్రవారం తస్లీమ్ సుల్తానా మృతదేహాన్ని పోలీసులు గజఈతగాళ్లతో బయటకు తీయించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం ఆమె కుమారుడి మృతదేహం కూడా అదే చెరువులో లభించింది. దీంతో వరంగల్, మామునూరు ఏసీపీలు కిషన్, సతీశ్‌బాబు, మిల్స్‌కాలనీ సీఐ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. బాలుడి మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానలోని మార్చురీలో భద్రపరిచి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, భర్త తన్వీర్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం చేసిన వేధింపుల వల్లే తస్లీమ్ సుల్తానా తన కుమారుడితో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె భర్తతోపాటు అత్తమామ ఇతర కుటుంబ సభ్యులు కలిపి ఆరుగురిపై కేసు నమోదు చేయగా, భర్త పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## స్వగ్రామానికి చేరిన భవ్య మృతదేహం

ఖానాపురం, జనవరి 4: బుధరావుపేటకు చెందిన కోడి కృష్ణ, లలిత దంపతుల కుమార్తె భవ్య భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో మరో బాలికతో కలిసి శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. భవ్య మృతదేహాన్ని ఆదివారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు. కృష్ణ, లలిత దంపతులు పదేళ్ల నుంచి హైదరాబాద్ హబ్సిగూడలో ఉంటున్నారు. వారి కూతురు భవ్యను భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో చదివిస్తున్నారు. ఈ క్రమంలో బాలిక హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

## సమ్మయ్యకు ఘన సన్మానం

- పద్మ పురస్కారానికి ఎంపికైన జనగామ జిల్లావాసికి రూ.25లక్షల చెక్కు
- అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు

పద్మ పురస్కారానికి ఎంపికైన జనగామ జిల్లా దేవరుప్పల మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఘనంగా సన్మానించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నగదు బహుమతి కింద రూ.25లక్షల చెక్కును ఆయనకు అందించారు.



## కనకదుర్గ చిట్‌ఫండ్ మాజీ ఉద్యోగి ఆత్మహత్య

- హరిత హోటల్‌లో ఉరేసుకున్న భాస్కర్‌రెడ్డి
- ఒత్తిడికి లోనై తనువు చాలించినట్లు అనుమానాలు



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

సుబేదారి, ఫిబ్రవరి 4: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన హనుమకొండ నక్కలగుట్ట హరితహోటల్‌లో ఆదివారం జరిగింది. సుబేదారి ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ ఎక్సైజ్‌కాలనీకి చెందిన నల్లా భాస్కర్‌రెడ్డి(28) కనకదుర్గ చిట్‌ఫండ్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో చాలామంది నుంచి డిపాజిట్లు చేయించాడు. కానీ యాజమాన్యం ఆరు నెలలుగా అతడికి వేతనం ఇవ్వకపోగా ఉద్యోగం నుంచి తొలగించింది. పైగా డిపాజిట్లు చేసిన వారికి యాజమాన్యం డబ్బులు చెల్లించకపోవడంతో వారి నుంచి అతడికి ఒత్తిడి పెరిగింది. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చి హనుమకొండ నక్కలగుట్ట హరిత హోటల్‌లో రెండు రోజుల క్రితం రూమ్ తీసుకొని ఉంటున్నాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆరా తీశారు. హరిత హోటల్ ముందు అతడి కారును గుర్తుపట్టి, రూమ్ బుకింగ్ వివరాలను హోటల్ సిబ్బందిని తెలుసుకున్నారు. వారు చెప్పిన గదికి వెళ్లి డోర్ పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతదేహమై వేలాడుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలు సేకరించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### భాస్కర్‌రెడ్డికి కంపెనీతో సంబంధం లేదు..

హరిత హోటల్‌లో ఆత్మహత్యకు పాల్పడిన భాస్కర్‌రెడ్డితో తమ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని కనుకదుర్గ చిట్‌ఫండ్ ఎండీ ఓ ప్రకటనలో తెలిపారు. తమ కంపెనీ డైరెక్టర్ కూడా కాదని, ఉద్యోగిగా కొంతకాలం పనిచేసి మానేశాడని పేర్కొన్నారు. తమ కంపెనీపై తప్పుడు ప్రచారం చేయొద్దని కోరారు.

## మేడారం దారిలో చెట్ల నరికివేత

- జంగిల్ కటింగ్‌లో నేలకొరుతున్న వృక్షాలు
- మెయింటనెన్స్ పేరుతో ఆర్‌అండ్‌బీ పనులు
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు



కమలాపూర్-రాంపూర్ మధ్య రోడ్డు వెంట నరికేసిన చెట్లు



జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : మేడారం దారిలో చెట్లు నేలకొరుగుతున్నాయి. మెయింటెనెన్స్‌లో భాగంగా చేస్తున్న జంగిల్ కటింగ్ పేరుతో భారీ వృక్షాలను నరికేస్తున్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర సమీపిస్తుండడంతో జిల్లాలోని భూపాలపల్లి మండలం కమలాపూర్ రోడ్డు, కాటారం రోడ్డు పొడవునా మేడారం వరకు రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ అధికారులు జంగిల్ కటింగ్, సైడ్‌బర్మ్, మెయింటెనెన్స్ పనులను ప్రారంభించారు. మొత్తం 75 కిలోమీటర్ల పొడవునా రూ.15లక్షలతో చేపట్టిన ఈ పనుల్లో చెట్లను తొలగిస్తున్నారు. కాటారం రోడ్డు పొడవునా మేడారం వరకు 50కిలోమీటర్లు, భూపాలపల్లి మండలం కమలాపూర్ రోడ్డు పొడవునా 25 కిలోమీటర్లు జంగిల్ కటింగ్ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా చదును చేయడం, అవసరమైన చోట సైడ్‌బర్మ్ పోయడం, వాహనాలకు అడ్డు వచ్చే చెట్ల కొమ్మలను కట్ చేయిస్తున్నారు. అయితే చెట్లను మాత్రం తొలగించొద్దు. కానీ మండలంలోని కమలాపూర్, రాంపూర్ గ్రామాల మధ్య జంగిల్ కటింగ్‌లో భాగంగా యథేచ్ఛగా చెట్లను నరికేస్తున్నారు. ఈ రోడ్డు వెంట గట్టమ్మ ఆలయ సమీపంలో సుమారు పది భారీ వృక్షాలు నేలకొరిగాయి. అయినప్పటికీ అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్ దృష్టికి తీసుకెళ్లగా మేడారం వరకు అటు కాటారం, ఇటు కమలాపూర్ గుండా రూ.15లక్షలతో జంగిల్ కటింగ్ పనులు చేపట్టామని, అవసరమైన చోట సైడ్ బర్మ్ పనులు చేయిస్తున్నామని తెలిపారు. ఎక్కడ కూడా చెట్లు నరికేయలేదని, అడ్డుగా వచ్చే కొమ్మలను మాత్రమే కట్ చేస్తున్నామని చెప్పారు. అటవీశాఖ రేంజ్ అధికారి నరేశ్ మాట్లాడుతూ మేడారం దారిలో చెట్లను నరికేసిన విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రామప్పలో సందడి

### ఆలయ విశిష్టతను తెలుసుకున్న పర్యాటకులు

రామప్ప ఆలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విన్నారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు. అలాగే గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సందర్శనకు పర్యాటకులు పోటెత్తారు. మేడారం సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో పర్యాటకులు లక్నవరం సందర్శనకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద బోటు ఒక్కటే పర్యాటక శాఖ నడుపుతుండడంతో స్పీడ్ బోటులో షికారు చేయాలనుకునే పర్యాటకులు నిరాశగా వెనుదిరిగారు.


*- వెంకటాపూర్/ గోవిందరావుపేట ఫిబ్రవరి 4*



రామప్పలో పూజలు చేస్తున్న భక్తులు



బోటు షికారు కోసం క్యూలో నిలుచున్న పర్యాటకులు



బోటులో ప్రయాణిస్తున్న పర్యాటకులు